సాక్షి కరీంనగర్

గురువారం । 9 । నవంబర్ । 2023

పదహారు భాషల్లో ఓటరు జాబితా

మీకు తెలుసా?



కరీంనగర్ అర్బన్: ఓటరు జాబితా 16 భాషల్లో ముద్రిస్తారు. ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైన ఓటర్లలో 20శాతం మందికి పైగా అధికార భాష కాకుండా మరేదైనా భాష మాట్లాడుతూ ఉండి ఆ మైనార్టీ భాషలో అక్షరాస్యుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు వారి భాషలోనూ జాబితాను ప్రచురించి ప్రకటించాలని ఎన్నికల సంఘం ఆదేశిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో బ్యాలెట్ కూడా విభిన్న భాషల్లో ముద్రిస్తారు. దీనికి తోడు అన్ని మెట్రో నగరాల్లో ఓటరు జాబితాలను ఆంగ్లంలో సైతం ప్రచురిస్తారు. సర్వీసు ఓటర్ల జాబితాలో చివరి భాగం తప్పనిసరిగా ఆంగ్లంలోనే ఉంటుంది. ప్రస్తుతం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆంగ్లం తోపాటు 16 భాషల్లో ఓటర్ల జాబితాను ప్రచురిస్తున్నారు.

నామినేషన్ల వివరాలు.. 5వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
కరీంనగర్	04	04
హుజూరాబాద్	05	06
మానకొండూర్	03	05
చొప్పదండి	04	05

న్యూస్‌రీల్

'బైండోవర్ల పేరిట ఒత్తిడి చేస్తారా?'



కరీంనగర్: తెలంగాణ ఉద్యమ సమయంలో కరీంనగర్ జిల్లా ఉద్యమకారులపై నమోదైన కేసులను బూచిగా చూపిస్తూ బైండోవర్ల పేరిట సీపీ ఒత్తిడి చేయడం తగదని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014, 2018 సాధారణ ఎన్నికల సమయంలోనూ ఉద్యమకారులను పోలీసులు బైండోవర్ల పేరిట పిలవలేదని పేర్కొన్నారు. ఉద్యమకారుల కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరుపుతారా.. బైండోవర్ల పేరిట ఇళ్లలోకి పోలీసులను పంపి, అశాంతిని రేకెత్తిస్తారా అని ప్రశ్నించారు. చట్టబద్ధంగా నోటీసులు ఇచ్చి, పోలీసులను పంపించాలని కోరారు. సీపీ తన వైఖరి మార్చుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. సమావేశంలో నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, మైఖేల్ శ్రీనివాస్, పెండ్యాల మహేశ్, కెమసారం తిరుపతి, జీఎస్.ఆనంద్, సాయి, విష్ణు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రవీందర్‌సింగ్‌పై కేసు?

కరీంనగర్ క్రైం: సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్‌పై కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు తెలిసింది. అనుమతి లేకుండా మీడియా సమావేశం ఏర్పాటు చేసినందుకు, పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేసినందుకు ఆయనపై కేసు నమోదు చేశారని సమాచారం.

జాబ్ మేళాలో 10 మంది ఎంపిక



కరీంనగర్‌సిటీ: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, టీఎస్‌కేసీ(తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్), టీవీఎస్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్‌ల ఆధ్వర్యంలో బుధవారం యాక్సిస్ బ్యాంక్ జాబ్ మేళా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు స్వశక్తితో ఎదిగి, ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలన్నారు. తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా ప్రైవేట్ రంగంలో ఉన్న అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ సీహెచ్.మారుతి మాట్లాడుతూ.. ప్రైవేట్ రంగంలో చాలా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూడొద్దన్నారు. జాబ్‌మేళాకు 70 మందికి పైగా అభ్యర్థులు రాగా 10 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి అక్షిత్, హెచ్ఆర్ మేనేజర్, టీఎస్‌కేసీ మెంటార్ డి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్

కరీంనగర్ కార్పొరేషన్: ఈ నెల 30వ తేదీన జరిగే సాధారణ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో ఓటు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధిగా ఓటు వేయడంతో పాటు, ఇతరులు కూడా ఓటు వేసేలా చైతన్యపరచాలని సూచించారు. సీవీజిల్ యాప్, టోల్‌ఫ్రీ నంబర్, ఎన్నికల నియమావళి, ఉల్లంఘన తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

నగరంలోని వీధిదీపాలు నిర్వహణ సక్రమంగా చేపట్టాలని కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. నిర్వహణ లోపంతో కొన్ని చోట్ల సమాయానికి భిన్నంగా వెలగడం జరుగుతుందని, దీనిని నియంత్రించాలని సూచించారు. నిర్ణీత వేళలకు అనుగుణంగా వీధి దీపాలు వెలగాలని, అలాగే వేళకు బంద్ కావాలన్నారు. ఎక్కడైనా కేబుల్, బాక్స్‌లు దెబ్బతిన్నాయో చూసి, ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆయన ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, అసిస్టెంట్ కమిషనర్ నరేశ్ బాబు, ఈఈ కిష్టప్ప, ఆర్ఓ ఆంజనేయులు, శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ వేదికన.. ఎడారి వేదన!

ప్రవాసీ పాలసీయే అజెండా

- ఉమ్మడి జిల్లాలో 3.71 లక్షల వలసజీవుల ఓట్లు
- ఎన్నికల బరిలో గల్ఫ్ వాపసీలు
- నామినేషన్లకు సిద్ధమవుతున్న ఎన్నారైలు
- ఇప్పటికే ఇద్దరి నామినేషన్.. రెడీగా మరో ముగ్గురు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:


ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అందులోనూ ఉత్తర జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో కరువు తాండవించేది. అందుకే, ఇక్కడి యువత గల్ఫ్ వలసలకు మొగ్గు చూపేవారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక వలసలు తగ్గినా.. గల్ఫ్‌లో చక్కటి ఉపాధి కోసం వెళ్లే యువతలో ఆసక్తి మాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలో ఎడారి దేశాల్లో ఆకస్మిక మరణాలు, మరణించిన వారికి బీమా పరిహారం, అనారోగ్యం, తిరిగి వచ్చిన వారికి పునరావాసం, వ్యాపార సబ్సిడీలు, రాయితీలు వంటి వాటి కోసం ఒక విధానం ఉండాలని చాలాకాలంగా పోరాటాలు సాగుతున్నాయి. ఈసారి అసెంబ్లీ ఎన్నికలను తమ డిమాండ్ల సాధనకు వేదికగా ఎంచుకున్నారు. ఎన్నికల సాక్షిగా తాము బరిలో నిలిచి, తమ సాధకబాధకాలను లోకానికి తెలియజేస్తే.. కనీసం ఈ దఫా ప్రభుత్వంలోనైనా తమ బతుకులకు భరోసా దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 3.71 లక్షల గల్ఫ్ కుటుంబాల ఓట్లు ఉన్నాయి. వీరందరినీ ఏక తాటిపై తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

15 లక్షల మంది వరకు గల్ఫ్ వాపసీలు

గల్ఫ్ దేశాల్లో మన రాష్ట్ర కూలీలు 15 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. గత పదేళ్లలో ఎడారి దేశాల నుంచి మరో 15 లక్షల మంది వాపస్ వచ్చి, స్వగ్రామాల్లో సరైన ఉపాధి లేక ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. స్థానిక వనరులతో పరిశ్రమలు ఏర్పాటు చేసి, వ్యవసాయ రంగానికి మద్దతు ఇస్తే వలస సమస్యలు కొంతవరకు తీరుతాయని వారి వాదన. రాష్ట్రంలో మొత్తం 32 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ కుటుంబాల ఓట్లు నిర్ణయాత్మకంగా మారతాయని ధీమాగా ఉన్నారు. అందుకే, వీరిలో రాజకీయ చైతన్యం రగిలించాలని, తద్వారా అనుకున్న డిమాండ్లు నెరవేర్చుకునేలా పలువురు గల్ఫ్ ఉద్యమకారులు ప్రణాళికలు రచిస్తున్నారు.

నామినేషన్ల ద్వారా నిరసన

గల్ఫ్ కార్మికుల సమస్యలను, న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయాలని, వారిపై సానుభూతి ఉన్న ఓటర్లను తమవైపు తిప్పుకోవాలన్నది గల్ఫ్ ఉద్యమకారుల వ్యూహం. ఈ అసెంబ్లీ ఎన్నికలను వేదికగా చేసుకొని, నామినేషన్లు వేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఇద్దరు నామినేషన్ వేయగా మరో మహిళ గురువారం ధర్మపురిలో వేసేందుకు సిద్ధమవుతున్నారు.



నామినేషన్లు వేసేది వీరే..

వేములవాడ: గుగ్గిళ్ల రవిగౌడ్
నిర్మల్: స్వదేశ్ పరికిపండ్ల
కోరుట్ల: చెన్నమనేని శ్రీనివాసరావు
సిరిసిల్ల: కృష్ణ దొనికెని
ధర్మపురి: బూత్కురి కాంత

నోట్: వీరిలో వేములవాడ, నిర్మల్‌లో నామినేషన్ వేశారు. కోరుట్ల, సిరిసిల్ల, ధర్మపురిలో వేయాల్సి ఉంది.

సోషల్ మీడియా అస్త్రంగా..

గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రవాసులు ఈసారి రాష్ట్రంలోని గల్ఫ్ ఎన్నారైలు ఉండే 32 నియోజకవర్గాలను ప్రభావితం చేయాలనుకుంటున్నారు. ఇందుకోసం సోషల్ మీడియాను అస్త్రంగా ఎంచుకున్నారు. వాట్సాప్, ఈఎంవో ఎఫ్‌బీ మెసెంజర్, ఇన్‌స్టా తదితర యాప్స్ ద్వారా తమ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి, గల్ఫ్ సంఘాల అభ్యర్థులకు ఓట్లు వేయించాలని కోరుతున్నారు.

ఎన్ఆర్ఐ పాలసీ తేవాలి



ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. వారి కోసం గల్ఫ్ బోర్డుతో కూడిన ప్రత్యేక ఎన్ఆర్ఐ పాలసీ తేవాలి. అక్కడ మరణించిన కుటుంబాల సంక్షేమం, తిరిగి వచ్చిన వారికి ఉపాధి, పరిశ్రమల ఏర్పాటుకు విధానం రూపొందించాలి. 32 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేసేలా గల్ఫ్ కుటుంబాలు ఉన్నాయి. మా గోడు ప్రభుత్వాలకు తెలిసేలా కామారెడ్డి నుంచి 100 మంది గల్ఫ్ విడోలు, నిర్మల్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల, వేములవాడ, సిరిసిల్ల నుంచి ఒక్కో విడోతో నామినేషన్ వేయించబోతున్నాం.

– మందా భీంరెడ్డి, గల్ఫ్ వలస వ్యవహారాల విశ్లేషకులు

ఎన్నికల నియమావళి పాటించాలి



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

హుజూరాబాద్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ అభిషేక్ మహంతి అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లోని ఎన్నికల అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. నామినేషన్ల తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి అమల్లో ఉందని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాలు సైతం బందోబస్తుకు వచ్చాయని, పార్టీల అభ్యర్థులు ర్యాలీలు, రోడ్‌షోలకు రిటర్నింగ్ అధికారి అనుమతి పొందాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ బొల్లం రమేశ్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

- భవిత కేంద్రాల ద్వారా ఐఈఆర్పీ సేవలు అందించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌టౌన్: గర్భం దాల్చిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంతానోత్పత్తి సమస్యలను అర్థం చేసుకోవడంపై దంపతులకు అవగాహన కల్పించాలని, ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రిజిస్ట్రేషన్ నుంచి మొదలుకుని రెండో అంతస్తులో చిన్నపిల్లలకు అందిస్తున్న ఫిజియోథెరపీ కేంద్రం వరకు ప్రతీ విభాగాన్ని పరిశీలించి, అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఐన్‌క్యూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ) ద్వారా సేవలను అందించాలని సూచించారు. తల్లిదండ్రులకు పుట్టబోయే బిడ్డ, తల్లి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులపై వైద్యులు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా లింగనిర్ధారణ జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని, ఎవరైనా లింగనిర్ధారణకు పాల్పడినట్లు తమదృష్టికి వచ్చినట్లయితే వారిపై చట్టరీత్యా కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని ప్రతీ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్ ఆస్పత్రి నిర్వహణ, అందిస్తున్న వైద్యసేవలు బాగున్నాయని వైద్యాధికారులను అభినందించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణప్రసాద్, ఆర్ఎంవో జ్యోతి, డాక్టర్ నవీన, అలీం పాల్గొన్నారు.

ఐదేళ్లు మీకోసం రక్తం ధారపోస్తా..



ఆర్డీవోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న మంత్రి గంగుల తదితరులు



నామినేషన్ అనంతరం మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- 20 రోజులు నా కోసం పనిచేయండి
- కరీంనగర్ బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నామినేషన్ దాఖలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్: హైదరాబాద్ సంపదపై ఆంధ్రావాళ్లు కన్నేశారని, వారికి వంతపాడుతున్న కాంగ్రెస్, బీజేపీలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇరువై ఏళ్లుగా ఆశీర్వదిస్తున్న ప్రజలు మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే తన రక్తం ధారపోసి పనిచేస్తానని కరీంనగర్ బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ వేసే ముందు కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకున్నారు. నామినేషన్ పత్రాలకు ప్రత్యేకపూజలు చేయించి బీఆర్ఎస్ నాయకులు కొత్త జైపాల్‌రెడ్డి, కంసాల శ్రీనివాస్, మెతుకు సత్యంతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి రెండుసెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అనంతరం కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలతో నగరంలో భారీర్యాలీ నిర్వహించారు. తెలంగాణచౌక్‌లో జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ చెబుతున్న కల్లబొల్లి మాటలు నమ్మవద్దని, వారిహయాంలో జరిగిన అభివృద్ధి, పదేళ్లల్లో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. పచ్చని తెలంగాణలో చిచ్చుపెట్టాలని మళ్లీ ఆంధ్రా నాయకులు ఏకమవుతున్నారని, సీఎం కేసీఆర్‌ను ఎలాగైనా ఓడించి హైదరాబాద్ సంపదను దోచుకెళ్లేందుకు తహతహలాడుతున్నారని ఆరోపించారు. 'కేసీఆర్ లేని తెలంగాణ ఊహించుకోలేం.. తస్మాస్ జాగ్రత్త.. ఆ రెండు పార్టీలతో అప్రమత్తంగా లేకపోతే తెలంగాణ మళ్లీ అంధకారమవుతుంది' అని ఆందోళన వ్యక్తం చేశారు. 20 రోజులు తన కోసం పనిచేస్తే ఐదేళ్లు మీకోసం తన రక్తం ధారపోస్తా అని భరోసా ఇచ్చారు. అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి బాసటగా నిలవాలని, ముచ్చటగా సీఎం కేసీఆర్‌ను మూడోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మతోన్మాదంతో ఒక అభ్యర్థి, భూ కబ్జాలతో మరో అభ్యర్థి ఓట్ల కోసం వస్తున్నారని, నగరాన్ని సర్వనాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఇలాంటి వారికి ప్రజలే తగిన శాస్తి చేయాలని సూచించారు. మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ.. కేబుల్ బ్రిడ్జ్ కూలిపోతుందని బండి సంజయ్ చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కరీంనగర్‌లో సంజయ్ ఏనాడూ తిరగలేదు కాబట్టి ఆయన కళ్లకు ఇన్ని రోజులు చేసిన అభివృద్ధి కనబడలేదని అన్నారు. నామినేషన్ వేసిన మంత్రి కమలాకర్‌కు ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, నాయకులు మద్దతు తెలిపారు. నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ రెడ్డ వేణి మధు పాల్గొన్నారు.

గంగుల ఆస్తులు రూ.25.50 కోట్లు

మంత్రి కమలాకర్ తన అఫిడవిట్‌లో మొత్తం రూ.25.50 కోట్ల స్థిరచరాస్తులు, రూ.50 లక్షల బ్యాంకు రుణాలు, 8 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ చదివిన ఆయన తన వద్ద రూ.2.25 లక్షలు, 436 తులాల బంగారు కడియాలు, బ్రాస్‌లెట్లు ఇతర ఆభరణాలు(రూ.2.45 కోట్లు), 1995 మోడల్ యమహా బైక్, దాదాపు రూ.70 లక్షల విలువైన భారత్ బెంజ్ కారవాన్ వాహనాలు ఉన్నాయన్నారు. ఆయన భార్య రజిత వద్ద రూ.3.15 లక్షలు, 800 తులాల ఆభరణాలు(రూ.4.5 కోట్లు) ఉన్నాయని పేర్కొన్నారు. కాగా, 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన తన ఆస్తులు రూ.24.5 కోట్లు, అప్పులు రూ.3.4 కోట్లుగా చూపించారు.

అబద్ధాల బీఆర్ఎస్‌ను నిలదీయండి



మానకొండూర్: మాట్లాడుతున్న ఎంపీ సంజయ్‌కుమార్

- స్థానిక అభ్యర్థిని గెలిపించండి
- మానకొండూర్‌లో ఎంపీ బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్/మానకొండూర్: అబద్ధాల బీఆర్ఎస్‌ను ప్రజలు నిలదీయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మానకొండూర్‌లో బీజేపీ అభ్యర్థి ఆరెపల్లి మోహన్ నామినేషన్ వేసిన సందర్భంగా హాజరైన సంజయ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు ఇస్తోంది కేంద్రమే అని అన్నారు. మరో ఐదేళ్ల పాటు కేంద్రం బియ్యం ఉచితంగా ఇవ్వనుందని, తామే ఇస్తున్నామని బీఆర్ఎస్ నేతలు చెబితే గల్లాపట్టి నిలదీయాలని సూచించారు. గ్రామాల్లో జరిగిన పనులకు కేంద్రమే నిధులు ఇచ్చిందని తెలిపారు. ఇక్కడి ఎమ్మెల్యే ఎన్ని ఇండ్లు ఇచ్చారో, ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, గెలిచిన తర్వాత పోయేది టీఆర్ఎస్‌కేనని ఎద్దేవా చేశారు. ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని అన్నారు. సమస్యలు తెలిసిన నాయకుడు ఆరెపల్లి మోహన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, రాపాక ప్రవీణ్, మాడ వెంకటరెడ్డి, ఇనుగొండ వెంకటరెడ్డి, మియాపురం లక్ష్మణాచారి పాల్గొన్నారు.



కరీంనగర్ టౌన్: ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

రేకుర్తిలో ఇంటింటి ప్రచారం

కరీంనగర్ పరిధిలోని రేకుర్తిలో బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు ఎడమ సత్యనారాయణ రెడ్డి, విష్ణుప్రసాద్‌రావు, మోహన్ బాబు, వివేక్, రాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీపీఐ ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఎన్నిక


వెంకటస్వామి

కరీంనగర్: సీపీఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఆ పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఎన్నికైనట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ప్రకటించారు. సీపీఐ కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల కార్యవర్గ, కౌన్సిల్ సభ్యుల సమావేశంలో మర్రి వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులుగా మూడు జిల్లాల పార్టీ కార్యదర్శులు గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేశ్ ఎన్నికల వరకు కొనసాగుతారని తెలిపారు. అనంతరం మర్రి వెంకటస్వామి మాట్లాడారు.

రాములోరి సన్నిధిలో బీజేపీ నాయకుల పూజలు


పూజలు చేసిన నాయకులు

ఇల్లందకుంట(హుజూరాబాద్): స్థానిక శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో స్థానిక సర్పంచ్ కంకణాల శ్రీలత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుజూ రాబాద్ బీజేపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా నామినేషన్ పత్రాలను స్వామివారి పాదాల వద్ద ఉంచారు. ప్రతీ ఎన్నికల సందర్భంగా ఆయన ఇక్కడ పూజలు చేస్తారని తెలిపారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఈటల మరోసారి గెలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, మండల అధ్యక్షుడు సింగంరెడ్డి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ ఆరెల్లి జ్యోత్స్న, నాయకులు కంకణాల సురేందర్‌రెడ్డి, మహిపాల్‌యాదవ్, క్యాం సత్యనారాయణ రెడ్డి, ఎండీ.షఫీ, గురుకుంట్ల సాంబయ్య, అంతం ఎల్లారెడ్డి, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అక్రమ మద్యం సీజ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎన్నికల నియామవళి అమలులో ఉన్నప్పుడు మద్యం అక్రమంగా నిల్వ ఉంచడం, రవాణా చేయడం, విక్రయించడం చట్ట విరుద్ధమని ఎక్సైజ్ సీఐ గులాం ముస్తఫా పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌లో బుధవారం వాహనాల తనిఖీ చేపడుతుండగా అక్రమంగా మద్యం తరలిస్తున్న పెద్దలింగాపూర్‌కు చెందిన దర్శనం రాములు, బండారి లింగంలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7వేల విలువైన మద్యాన్ని సీజ్ చేశారు. తనిఖీలలో ఎక్సైజ్ ఎస్సైలు శేఖర్, రాజేందర్, సిబ్బంది శ్రీనివాస్, నరేందర్, జి.శ్రీనివాస్, మధు, రూప, అనూష పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

చందుర్తి(వేములవాడ): మండలంలోని మర్రిగడ్డ గ్రామశివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన చెట్‌పల్లి శ్రీనివాస్ తన కూతురు, కుమారుడితో కలిసి సిరిసిల్ల పట్టణంలోని తన బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా మర్రిగడ్డ గ్రామశివారులోకి రాగానే పెట్రోల్ బంకు సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం స్థానికులు వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


కలెక్టరేట్ నామినేషన్ సెంటర్ వద్ద విధుల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు


బైనాక్యులర్ ద్వారా పర్యవేక్షిస్తున్న సిబ్బంది

రంగంలోకి స్పెషల్ టాస్క్‌ఫోర్స్

- 8 బృందాల ఏర్పాటు
- నామినేషన్ల సందర్భంగా పటిష్ట బందోబస్తు
- మెరుపు దాడులు, కార్డెన్‌సెర్చ్, ఇతర ఎన్నికల విధులు
- కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు

కరీంనగర్ క్రైం: అసెంబ్లీ పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన కమిషనరేట్ పరిధిలో 8 స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇవి ఎన్నికల విధుల్లో పాల్గొంటూ ఎన్నికల సందర్భంగా ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కరించనున్నాయి. సీపీ సూచనల మేరకు ఇటీవల కరీంనగర్ హెడ్ క్వార్టర్స్‌లో శిక్షణ పూర్తి చేసుకొని, ప్రస్తుతం రంగంలోకి దిగాయి.

అక్రమాలకు చెక్ పెట్టడానికే..

స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఫిజికల్ ఫిట్‌నెస్, ఆయుధాల వినియోగంపై రిఫ్రెష్ కోర్స్, శాంతిభద్రతల సమస్యలు ఎదురైనప్పుడు అల్లరి మూకలను చెదరగొట్టడం, అవసరమైతే లాఠీఛార్జ్ చేయడం, తనిఖీల సమయంలో తప్పించుకుపోయే వాహనాలను వెంబడించి, క్షుణ్ణంగా తనిఖీ చేయడం, ఉల్లంఘనలకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటాయి. సీపీ ఆదేశాల ప్రకారం ఆకస్మిక దాడులు, వాహన తనిఖీలు, మెరుపు దాడులు, కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్, ఎన్నికల నియమావళి అమలు వంటి అన్ని రకాల విధుల్లో వీరు పాల్గొంటారు. ప్రలోభాలు, వివిధ అక్రమాలకు చెక్ పెట్టడానికి పోలీస్‌బాస్ ఈ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేశారు.

నిరంతర పర్యవేక్షణ

ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసేవరకు కమిషనరేట్ వ్యాప్తంగా ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, పర్యవేక్షణకు అడిషనల్ డీసీపీ (శాంతి భద్రతలు) ఎ.లక్ష్మీనారాయణను నియమించారు. సాధారణ బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బందితోపాటు మూడు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు నామినేషన్ ప్రక్రియలో పని చేస్తున్నాయి. మూడు బృందాల్లో ఒకటి నామినేషన్ సెంటర్ వద్ద, మిగిలిన రెండింటికి ర్యాలీలు, బహిరంగ సభల వద్ద విధులు కేటాయించారు. సున్నితమైన ప్రాంతాల్లో రూఫ్ టాపుల్లో సిబ్బందిని ఉంచి, బైనాక్యులర్ ద్వారా పర్యవేక్షిస్తూ వీడియో తీయిస్తున్నారు.

ఉల్లంఘిస్తే ఉపేక్షించబోం



ఎన్నికల నిబంధనలకు లోబడి ప్రచారాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలను ముందస్తు అనుమతి మేరకే నిర్వహించుకోవాలి. ఉల్లంఘనలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించబోం. ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగానే స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పాటు చేశాం.

– అభిషేక్ మహంతి, కరీంనగర్ సీపీ

బీజేపీ బీసీ సీఎం అనడం హాస్యాస్పదం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి


మాట్లాడుతున్న వెంకటరెడ్డి

కరీంనగర్: బీసీ వాలా, చాయ్ వాలా అని చెప్పుకునే ప్రధాని మోదీ బీసీల జనగణన ఎందుకు చేయడం లేదో చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సీపీఐ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేశ్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నిరుద్యోగులకు ఇస్తామని చెప్పిన 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని, నల్లధనం వెనక్కి తెచ్చారా అని ప్రశ్నించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చి, అమలు చేయడం లేదన్నారు. ధరణి పోర్టల్ వల్ల రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంగన్వాడీలు, ఆశవర్కర్లు, రెండో ఏఎన్ఎంలు ఇతర అసంఘటిత రంగ కార్మికులు తమ సమస్యలపై ఉద్యమిస్తున్నా పాలక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధ పాలన కోసం కాంగ్రెస్‌తో ఒక అవగాహన కుదుర్చుకొని ఎన్నికలకు వెళ్తున్నామని తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపెల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, బ్రామండ్లపెల్లి యుగంధర్, బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధర రూ.7,100


మిల్లులో కొనుగోలు చేసిన పత్తి

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి గరిష్ట ధర రూ.7,100 పలికింది. బుధవారం మార్కెట్‌కు 13 వాహనాల్లో 194 క్వింటాళ్ల పాత పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,100, కనిష్ట ధర రూ.7,050 వ్యాపారులు చెల్లించారు. 117 వాహనాల్లో 1,001 క్వింటాళ్ల కొత్త పత్తిని తీసుకురాగా, క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,900, మోడల్ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.6,000కు కొనుగోలు చేశారు. గన్నీ సంచుల్లో 49 మంది రైతులు 81 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా, క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,500, మోడల్ ధర రూ.6,300, కనిష్ట ధర రూ.5,500కు కొనుగోలు చేశారు.

సీసీఐ కొనుగోళ్లు..

మార్కెట్‌లో 11 మంది రైతులకు చెందిన 103.20 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,949.80, కనిష్ట ధర రూ.6,714 పలికింది.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం


అయాన్ ఖాన్ (ఫైల్)

తిమ్మాపూర్: అతివేగంగా బైక్ నడిపి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ మైనర్ బాలుడు మృతిచెందిన సంఘటన కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని తీగల వంతెన వద్ద చోటు చేసుకుంది. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ హౌసింగ్‌బోర్డ్‌కు చెందిన అయాన్ ఖాన్ (14) ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం బంధువు ద్విచక్రవాహనం తీసుకొని తీగల వంతెన మీదుగా మానకొండూరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు మరమ్మతు కోసం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడి తండ్రి అయాబ్ ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

15 నుంచి బీఫార్మసీ పరీక్షలు

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఈనెల 15వ తేదీ నుంచి బీఫార్మసీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నామని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీన ఒకటి, రెండోసెమిస్టర్, ఈనెల 16న మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రూ.1.79 లక్షలు పట్టివేత



మెట్‌పల్లిరూరల్ : ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. బుధవారం మెట్‌పల్లి మండలం మారుతినగర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించగా కారులో రూ.లక్షా 79వేల నగదు పట్టుకొని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లవద్దని సూచించారు.

రామగుండంలో మద్యం..



రామగుండం: అక్రమంగా ఆటోలో తరలిస్తున్న మద్యాన్ని బుధవారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మల్యాలపల్లికి చెందిన సతీశ్ రామగుండంలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి రూ.8వేలు విలువగల మద్యం కొనుగోలు చేసి ఇంటికి తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీజ్ చేసి సతీశ్‌ను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సుంకరి రమేశ్ తెలిపారు. ఇక్కడ ఎస్సై శారద, సిబ్బంది ఖదీర్, ప్రసాద్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు చందపల్లికి చెందిన రాజం సంతోష్ (32) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. సంతోష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం పురుగుల మందు తాగగా గమనించిన స్థానికులు ప్రాథమిక చికిత్స చేయించి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. భార్య దేవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు


పట్టుకున్న మద్యం, నిందితులతో ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

జగిత్యాలక్రైం: మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని జగిత్యాల ఎక్సైజ్ సీఐ ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం రాయికల్ మండలంలోని ఒడ్డెలింగాపూర్ వైపు వెళ్తున్న మంక్యా నాయక్ తండాకు చెందిన ఇద్దరు నాటుసారా తయారీకి వాడే బెల్లం పానకాన్ని ద్విచక్రవాహనాలపై తరలిస్తుండగా పట్టుకున్నారు. వారినుంచి 80 కిలోల బెల్లం స్వాధీనం చేసుకోవడంతోపాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. కొత్తపేట వడ్డెరకాలనీకి చెందిన సూర రాజనర్సయ్య ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 11.04 లీటర్ల మద్యంతో పాటు, వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మంక్యానాయక్ తండా శివారులోని అటవీ ప్రాంతాల్లో 200 లీటర్ల బెల్లం పానకం, ఉప్పుమడుగు గ్రామ శివారులో వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. ఎక్సైజ్ పరిధిలో అక్రమంగా మద్యం రవాణాతోపాటు గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. దాడుల్లో ఎస్సై మేఘమాల, సరిత, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొలనూర్, గోపరపల్లె, నాంసానిపల్లె గ్రామాల్లో ఎస్సై నూతి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు.

లైన్‌మన్ సస్పెన్షన్

- మీటర్ ఏర్పాటుకు రూ.15 వేలు లంచం
- సీఎండీకి బాధితుడి ఫిర్యాదు
- సస్పెండ్ చేస్తూ ట్రాన్స్‌కో డీఈ ఉత్తర్వులు

కోరుట్ల: మీటరు ఏర్పాటు చేయాలని అడిగితే రూ.15వేలు లంచం డిమాండ్ చేసినట్లు లైన్‌మన్‌పై ఓ వినియోగదారు సీఎండీకి ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారుల సూచనల మేరకు సదరు లైన్‌మన్‌ను సస్పెండ్ చేస్తూ మెట్‌పల్లి ట్రాన్స్‌కో డీఈ తిరుపతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోరుట్ల పట్టణంలోని హాజీపురాలో అబ్దుల్ జమీర్, కాలిక్, సల్మాన్ ఇల్లు నిర్మించుకున్నాడు. మీటర్ కోసం ఆ ఏరియా ట్రాన్స్‌కో లైన్‌మన్ ఎల్.రవితేజకు దరఖాస్తు చేసుకున్నాడు. లైన్‌మన్ రవితేజ ఆ ఇంటిని పరిశీలించి ఇంటి నిర్మాణం పూర్తి కాలేదని, మీటర్ ఇవ్వరాదని దరఖాస్తును రిజెక్ట్ చేశాడు. ఇల్లు పూర్తిగా నిర్మించుకున్న తరువాత అబ్దుల్ జమీర్, కాలిక్, సల్మాన్, సలీం మళ్లీ మీటర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెండోసారి కూడా లోవోల్టేజీ సాకు చూపి దరఖాస్తు తిరస్కరించారు. దీంతో దరఖాస్తుదారులు ట్రాన్స్‌కో ఏఈ శ్యాంను కలిసి లైన్‌మన్ మీటర్ ఇవ్వమంటే రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని ఫిర్యాదు చేయగా.. ఆయన ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి మీటర్ ఇవ్వడంలో ఎలాంటి సమస్యలూ లేవని ధ్రువీకరించారు. అయినప్పటికీ లైన్‌మన్ రవితేజ తనకు లంచం కింద రూ.15వేలు ఇవ్వాల్సిందేనని వినియోగదారులను మరోసారి డిమాండ్ చేయడంతో వారు ట్రాన్స్‌కో సీఎండీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విచారణ జరిపిన ట్రాన్స్‌కో మెట్‌పల్లి డీఈ తిరుపతి లైన్‌మన్ రవితేజను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై 'సాక్షి' ఏడీఈ అంజన్‌రావును సంప్రదించగా ధ్రువీకరించారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ రమేశ్ రెడ్డి

తిమ్మాపూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి అన్నారు. మండలంలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు రావాలన్నారు. కళాశాల డైరెక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నాణ్యతతో కూడిన విద్య అందించడంతోవిద్యార్థులు వందశాతం ఉద్యోగ అవకాశాలు సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో పారువెల్ల రామారావు, మీడియా ఇన్‌చార్జి గొంటి రమేశ్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణను స్కాంల రాష్ట్రంగా మార్చారు

- ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలి శర్మ


మాట్లాడుతున్న ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలి శర్మ

హుజూరాబాద్: తెలంగాణను స్కాంల రాష్ట్రంగా మార్చారని ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలి శర్మ ఆరోపించారు. బుధవారం హుజూరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి పదేళ్లు గడిచినా డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించలేదన్నారు. లిక్కర్ స్కాం చేసిన ఎమ్మెల్సీ కవితను ఎందుకు అరెస్టు చేయడం లేదో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చినట్టే ఇచ్చి పేపర్ లీకేజీ, వాయిదా, రద్దు చేస్తుందే తప్ప ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడం లేదని మండిపడ్డారు. తెలంగాణ యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అబద్ధాలకోరులన్నారు. బీసీ సీఎంను చేస్తానని చెప్పిన బీజేపీ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ వ్యక్తిని తప్పించి, కిషన్ రెడ్డిని నియమించిందని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ యువతకు పోటీ పరీక్షల కోసం డిజిటల్ లైబ్రరీలు, స్టడీ సెంటర్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పర్యవేక్షకుడు నాగమధు యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని రవి, నాయకులు పత్తి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతకాయలు తెంపుతూ..

- చెట్టు కొమ్మల మధ్య ఇరుక్కొని వ్యక్తి మృతి


చెట్ల కొమ్మల మధ్య బాలనర్సు మృతదేహం

సిరిసిల్లటౌన్: చింతకాయలు తెంపుతూ చెట్టు కొమ్మల మధ్య ఇరుక్కొని ఓ వ్యవసాయ కూలీ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పదేళ్ల క్రితం ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది నుంచి వచ్చిన నిమ్మల బాలనర్సు (44) భార్య మాధవి, కూతురు లహరి (14)తో కలిసి సిరిసిల్ల పరిధిలోని జగ్గారావుపల్లెలో ఉంటున్నాడు. భార్యాభర్తలు వ్యవసాయ కూలీ పనులు చేస్తున్నారు. బుధవారం సిరిసిల్ల మార్కెట్‌లో నిమ్మకాయలు విక్రయించి ఇంటికి వెళ్లే క్రమంలో బాలనర్సు గ్రామ శివారులోని చింతచెట్టు ఎక్కాడు. చింతకాయలు తెంపి చెట్టు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారి కొమ్మల మధ్య ఇరుకున్నాడు. ఈ క్రమంలో లుంగీ గొంతుకు బిగించుకుపోగా చెట్టుపైనే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

ఉరేసుకొని యువకుడి బలవన్మరణం


వెంకటేశ్ (ఫైల్)

వేములవాడరూరల్: మండలంలోని మల్లారం గ్రామం రాజానగర్‌కు చెందిన గొర్రె వెంకటేశ్ (35) కుటుంబ కలహాలతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మారుతి తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్ పదేళ్ల క్రితం జగిత్యాల జిల్లా పొలాసకు చెందిన యువతిని ప్రేమవివాహం చేసుకున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో ఆమె జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన వెంకటేశ్ బుధవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య


నితిన్ (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గూడెంకు చెందిన గద్దల బాలయ్య, దేవవ్వ దంపతుల కుమారుడు నితిన్ ఐదు రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లాడు. తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న నితిన్ తల్లిదండ్రులకు ఒక్కాగానొక్క కుమారుడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

జీజీహెచ్‌లో శిశువు మృతి

- వైద్యులతో కుటుంబ సభ్యులు, బంధువుల వాగ్వాదం

కోల్‌సిటీ(రామగుండం): ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు జీజీహెచ్ ఆస్పత్రిలో ఆందోళన నిర్వహించారు. రామగుండంకు చెందిన తొమ్మిది నెలల గర్భిణి ఈనెల 1న గోదావరిఖనిలోని జీజీహెచ్ ఆస్పత్రిలో చేరగా 3న వైద్యులు డిశ్చార్జి చేశారు. మళ్లీ 5న మరోసారి చెకప్ కోసం రాగా పరీక్షలు నిర్వహించి ఇంటికి పంపించారు. ఈనెల 9న డెలివరీ చేస్తామని వైద్యులు తెలపగా బుధవారం ఆమె వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చింది. అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు కడుపులో శిశువు మృతిచెందిందని తెలిపారు. అనంతరం ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. అయితే ఈనెల 5న బెడ్లు ఖాళీగా లేవంటూ నిర్లక్ష్యంగా ఇంటికి పంపించారని, అప్పుడే అడ్మిట్ చేసుకొని వైద్యం అందిస్తే శిశువు చనిపోయేది కాదని, దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు, బంధువులు వాగ్వాదానికి దిగారు. విషయం తెలిసిన వన్ టౌన్ సీఐ ప్రమోద్‌రావు బాధితులతో మాట్లాడారు. ఈ విషయమై ఆర్ఎంవో అరుణను వివరణ కోరగా ఇందులో వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు.

చికిత్స పొందుతూ వేములకుర్తి యువకుడు..

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని వేములకుర్తిలో మూడురోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన హనుమంతరావు (20) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన హనుమంతరావు భార్య కళావతితో కలిసి ఆరునెలలుగా వేములకుర్తిలోని కోళ్లఫారంలో పనిచేస్తున్నాడు. ఈనెల 4న ఇద్దరి మధ్య గొడవ జరగగా కళావతి తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన హనుమంతరావు పురుగుల మందుతాగాడు. గమనించిన తోటి కూలీలు మెట్‌పల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
నిజామాబాద్
గురువారం ॥ 9-11-2023



పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు. పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా ఇటీవల మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది. కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో దేదీప్యమానంగా వెలిగిపోవాలి. అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు' అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి, కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు.. వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి? భేష్ అనదగిన విధానాలేమిటి? అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మనాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్పనక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ-బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మెటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మొటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10-15 రోజులు ఉండనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు. దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?



దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి. ● నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్లు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది. ● వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తిన డానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి ● నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు ● నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు ● ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో- బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని- ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు- ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.



లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...



పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు. ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో.

పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళా రూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...



● ఫౌజియా

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో' పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళా రూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు. ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.

డానిష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్టే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.